సాక్షి

కుమురం భీం

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



లక్క కోసం వృక్ష మేధం

ప్రాణహిత తీరం వెంట అడవుల్లో లక్క సేకరణ జోరుగా సాగుతోంది. అనుమతి లేకున్నా కొద్దిరోజులుగా చెట్లను విచ్చలవిడిగా నేలకూలుస్తున్నారు. IIలో▸



ఘనంగా రథోత్సవం

జిల్లా కేంద్రంలో శుక్రవారం బాలేశ్వరస్వామి జాతర అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఊరేగించారు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
34.2 /22.1

వాతావరణం

ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది. మధ్యాహ్నం వేడిగా, తెల్లవారుజామున చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన డీపీఆర్వో సంపత్‌కుమార్



కలెక్టర్ హేమంత్ బోర్కడేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీపీఆర్వో సంపత్‌కుమార్

ఆసిఫాబాద్‌రూరల్: డీపీఆర్వోగా జిల్లాకు బదిలీపై వచ్చిన సంపత్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ హేమంత్ బోర్కడేను కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

జిల్లా రవాణాశాఖ అధికారిగా రామచందర్



కలెక్టర్ హేమంత్ బోర్కడేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీటీవో రామచందర్

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా రవాణాశాఖ అధికారిగా శుక్రవారం రామచందర్ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన లక్ష్మి వరంగల్‌కు బదిలీ కాగా.. హైదరాబాద్‌లో పని చేస్తున్న రామచందర్ జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా డీటీవో రామచందర్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ హేమంత్ బోర్కడేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఆర్టీసీ ద్వారా భక్తులకు మేడారం ప్రసాదం

ఆసిఫాబాద్‌అర్బన్: సమ్మక్క, సారక్క మేడారం జాతరకు వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం టీఎస్ ఆర్టీసీ కార్గో ద్వారా ప్రసాదం అందించే ఏర్పాట్లు చేసినట్లు డిపో మేనేజర్ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిపో పరిధిలోని ప్రత్యేక కౌంటర్ల వద్ద ప్రసాదం బుక్ చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 91542 98534 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ప్రసాదం డోర్ డెలివరీ చేస్తామని తెలిపారు.

'ఎస్పీఎంలో యూనియన్ ఎన్నికలు జరపాలి'

కాగజ్‌నగర్‌రూరల్: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిర్పూర్ పేపర్ మిల్లులో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు జరపాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలో ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు శుక్రవారం ఆయనకు వినతిపత్రం అందించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జేకే కంపెనీ యాజమాన్యం స్థానికులకు తక్కువ జీతాలు, స్థానికేతరులకు మాత్రం అధిక జీతాలు చెల్లిస్తున్నారని విమర్శించారు. నాయకులు నాగేశ్వరరావు, అంబాల ఓదేలు, రాజనర్సయ్య, ఆనంద్‌కుమార్, రమేశ్, శివప్రసాద్, పురుషోత్తం ఉన్నారు.

ప్లాట్ల విక్రయాలు నిలిపివేయాలి

అక్రమ వెంచర్లలో ప్లాట్ల విక్రయాలను వెంటనే నిలిపి వేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాంలోని శివమల్లన్న ఆలయ సమీపంలో సర్వే నం.190లో అసైన్డ్ భూములను కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారని ఆరోపించారు. అనుమతి లేకుండా లేఅవుట్లుగా మార్చిన వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉత్కంఠ!

- రూ.500లకు సిలిండర్ లబ్ధిదారుల ఎంపికలో యంత్రాంగం నిమగ్నం
- పథకానికి 39 వేల దరఖాస్తులు
- ఈ నెలాఖరులోగా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ పూర్తి
- సర్కారు నిబంధనలపై స్పష్టత కరువు



సాక్షి, ఆసిఫాబాద్: అభయహస్తంలో భాగంగా ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేస్తున్న తెలంగాణ రాష్ట్ర సర్కారు తాజాగా రూ.500కే గ్యాస్ సిలిండర్ పంపిణీ చేసేందుకు సమాయత్తమవుతోంది. ఈ మేరకు గత వారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీర్మానించినా.. నిబంధనలపై స్పష్టత ఇవ్వాల్సి ఉంది. దీంతో లబ్ధిదారుల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. అభయహస్తం ప్రకటించిన వెంటనే ప్రజలు ప్రజాపాలనలో రాయితీ గ్యాస్ సిలిండర్ కోసం దరఖాస్తులు సమర్పించారు. ఇప్పటికే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంపు వంటి పథకాలు అమలవుతున్న సంగతి తెలిసిందే.

జిల్లాలో మొత్తం 1.40 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. ఇందులో సింగిల్ 1.12 లక్షలు, డబుల్ 28 వేల కనెక్షన్లు ఉన్నాయి. అభయహస్తంలో భాగంగా సర్కారు వారం రోజులపాటు ప్రత్యేకంగా నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులు రూ.500లకు రాయితీ గ్యాస్ సిలిండర్ పథకం కోసం దరఖాస్తులు స్వీకరించింది. ఈ దరఖాస్తులను మండల కార్యాలయాల నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయాలకు పంపగా.. గ్రామ పంచాయతీ సిబ్బంది వాటిని ప్రత్యేక పోర్టల్ ద్వారా లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తున్నారు. జిల్లాలో రూ.500కే గ్యాస్ పథకానికి 39వేలకుపైగా మంది దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం.

అర్హులు ఎంత మంది..?

రాయితీ గ్యాస్ పథకానికి కేవలం మహిళలే అర్హులని సర్కారు నిబంధన విధిస్తే మాత్రం జిల్లాలో దీపం, ఉజ్వల పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లు పొందిన వారే అర్హులుగా తేలుతారు. గుర్తింపు వివరాలు సమర్పించిన అందరికీ గ్యాస్ ఏజెన్సీలు కనెక్షన్లు ఇస్తూ వస్తున్నారు. అయితే దీపం, ఉజ్వల పథకాలకు వచ్చే సరికి మహిళల పేరిటే గ్యాస్ కనెక్షన్లు అందించారు. జిల్లాలో ఉన్న మొత్తం గ్యాస్ కనెక్షన్లలో 50వేలకు పైగా సాధారణ కనెక్షన్లు ఉండగా.. దీపం పథకం కింద 20,418, పీఎం ఉజ్వల కింద 27,851, కమర్షియల్ సిలిండర్ వినియోగదారులు 600లకుపైగా ఉన్నారు.

స్పష్టత వచ్చాకే..

ప్రభుత్వ ప్రకటించిన రాయితీ గ్యాస్ పథకం కోసం జిల్లాలో ఎంత మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారనే వివరాలు మండల, గ్రామ పంచాయతీల వద్దే ఉన్నాయి. ఈ– కేవైసీ ద్వారా గ్యాస్ ఏజెన్సీలు లబ్ధిదారులు వివరాలు సేకరిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలపై స్పష్టత వచ్చాకే మొత్తం లబ్ధిదారుల సంఖ్య ఎంతో తెలుస్తుంది. ఈ నెలాఖరులోగా ఈప్రక్రియ పూర్తవుతుందని భావిస్తున్నాం.

– కె.తారామణి, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

తెల్ల రేషన్‌కార్డుదారులే అర్హులా..

తెల్ల రేషన్‌కార్డు ఉన్న వాళ్లే రూ.500కే గ్యాస్ పథకానికి అర్హులని తెలుస్తోంది. ఇప్పటికే గృహజ్యోతి పథకానికి సైతం ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డు ఉన్న వాళ్లనే అర్హులు నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ లెక్కన రాయితీ గ్యాస్ పథకానికి ఇదే నిబంధన వర్తిస్తుందని సమాచారం. అది కూడా రేషన్‌కార్డు మహిళల పేరిటే ఉండాలన్న నిబంధన ఉందని తెలుస్తోంది. దీంతో ఎంత మందికి రాయితీ గ్యాస్ పథకం వర్తిస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది. తెల్లరేషన్‌కార్డు నిబంధన ద్వారా జిల్లాలోని మొత్తం గ్యాస్ కనెక్షన్లలో ప్రభుత్వ ఉద్యోగులు, దారిద్ర్యరేఖకు ఎగువ ఉన్న వారిని, కమర్షియల్ సిలిండర్ వినియోగదారును రాయితీ లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో జిల్లాలో రాయితీ గ్యాస్ పథకానికి అర్హులుగా సుమారు 80 వేల మందికిపైగా లబ్ధిదారులు తేలొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుదారుల వివరాలను ఈ– కేవైసీ ద్వారా గ్యాస్ ఏజెన్సీలు సేకరిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు ఈ ప్రక్రియ పూర్తయితే ఎంతమందికి రాయితీ గ్యాస్ పథకం అందించాలన్న దానిపై మరింత స్పష్టత రానుంది.

'పది'పై ప్రత్యేక నజర్!

- ఈ ఏడాదైనా స్థానం మెరుగయ్యేనా..?
- ఉత్తమ ఫలితాల సాధనపై జిల్లా విద్యాశాఖ దృష్టి
- కొనసాగుతున్న ప్రత్యేక తరగతులు
- పరీక్షలకు హాజరు కానున్న 6,710 మంది విద్యార్థులు



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: కొన్నేళ్లుగా జిల్లా పదో తరగతి వార్షిక పరీక్షల్లో వెనుకబడుతోంది. గత విద్యా సంవత్సరంలో జిల్లా 30 స్థానంలో నిలిచిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనపై జిల్లా విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 2023– 24 విద్యా సంవత్సరానికి సంబంధించి మార్చిలో జరిగే పరీక్షలకు ఇప్పటి నుంచే విద్యార్థులను సన్నద్ధం చేస్తోంది. కలెక్టర్ హేమంత్ బోర్కడే సైతం ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు డీఈవో ఆధ్వర్యంలో ఎంఈవోలు, హెచ్‌ఎంలు, వార్డెన్లకు మార్గనిర్దేశం చేస్తున్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తున్నారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి తరచూ జిల్లాలోని ఉన్నత పాఠశాలలను సందర్శిస్తూ విద్యార్థుల స్థాయిని అంచనా వేస్తున్నారు. రోజువారీగా టెస్టులు నిర్వహిస్తూ పరీక్షలపై విద్యార్థులకు భయాన్ని పోగొట్టాలని సూచిస్తున్నారు. వారం వారం నిర్వహిస్తున్న టెస్టుల ఫలితాల నివేదికను పరిశీలిస్తున్నారు. గురువారం కూడా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కేజీబీవీల ప్రత్యేకాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు

విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకమైంది. ఇక్కడి నుంచే భవిష్యత్తు నిర్మితమవుతుంది. దీంతో సాధారణంగానే విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి ఉంటుంది. జిల్లాలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన వారు అధికంగా ఉండటంతో గైర్హాజరు ఎక్కువగా ఉండి.. చదువులో వెనుకబడుతున్నారు. ప్రస్తుతం 15 మండల పరిధిలో 6,710 మంది పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరు కానున్నారు. ఇందులో 56 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 2,255 మంది చదువుకుంటుండగా 15 కేజీబీవీల్లో 505 , 40 ప్రైవేట్ స్కూళ్లలో 1193, 37 ఆశ్రమ పాఠశాలలో 1,119, మూడు మైనార్టీ గురుకులాల్లో 162, ఐదు పీటీజీ గురుకులాల్లో 340మంది, అలాగే కాగజ్‌నగర్‌లో జవహర్ నవోదయ విద్యాలయంలో 100, మూడు ఎయిడెంట్ పాఠశాలలో 68, ఐదు సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 382, రెండు ఆదర్శ పాఠశాల్లో 164 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. వీరితో పాటు మరికొంత మంది ఫీజులు కట్టి పరీక్షలకు హాజరు కానున్నారు. డీఈవో పరిధిలోని పాఠశాలల్లో ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటలు, అలాగే సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. నిత్యం స్లిప్ టెస్టులు పెడుతూ సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిని గుర్తిస్తున్నారు. అభ్యసన దీపికలు అందించి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. అలాగే వందశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా గురుకులాలు, మోడల్ స్కూళ్లు, సంక్షేమ వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులపైనా పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.

మార్చిలో వార్షిక పరీక్షలు

మార్చి 18 నుంచి 26 వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు. గతంలో హిందీ మినహా మిగిలిన సబ్జెక్టులకు రెండు పేపర్లు ఉండగా 11 రోజులు పరీక్షలు కొనసాగేవి. ప్రస్తుతం బయాలజీ, ఫిజిక్స్ సబ్జెక్టులకు వేర్వేరు రోజుల్లో పరీక్షలు నిర్వహిస్తుండగా.. మిగిలిన వాటికి ఒకటే పేపర్.. ఒకే పరీక్ష ఉండనుంది. 2022– 23 విద్యా సంవత్సరం ఫలితాల్లో జిల్లాకు చేదు అనుభవం ఎదురైంది. 76 శాతం ఉత్తీర్ణతతో జిల్లా 30వ స్థానంలో నిలిచింది. ఈ ఏడాది జిల్లాను టాప్ 10లో నిలిపేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. విద్యార్థుల కోసం ప్రత్యేక అభ్యాస దీపికలు సైతం రూపొందించింది. అయితే ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు ఆకలి కేకలు తప్పడం లేదు. గతేడాది కలెక్టర్ చొరవతో స్నాక్స్ అందించగా ఈ ఏడాది ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు ఆకలికి అలమటిస్తున్నారు. దాతలు ముందుకు వచ్చి అల్పాహారం, స్నాక్స్ అందించే ఏర్పాట్లు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

మెరుగైన ఫలితాలు సాధిస్తాం



2023– 24 విద్యా సంవత్సరంలో జరిగే పదో తరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధిస్తాం. ప్రతీ పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు కొనసాగుతున్నాయి. విద్యార్థులు ఎక్కువ మంది ఫెయిల్ అయ్యే మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులపై దృష్టి సారించాం. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిని గుర్తిస్తూ చర్యలు తీసుకుంటున్నాం.

– అశోక్, డీఈవో

సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

- ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి పోలీసుశాఖ కృషి చేస్తుందని ఎస్పీ సురేశ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు హెడ్‌క్వార్టర్‌లో శుక్రవారం దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసుశాఖలో పని చేసే ప్రతీ ఉద్యోగి క్రమశిక్షణ కలిగి ఉండాలన్నారు. బాధ్యతగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందించాలని సూచించారు. వృత్తి నిర్వహణలో నైపుణ్యాలు పెంచుకుంటూ శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. వ్యాయమం, యోగా చేయడం అలవర్చుకోవాలని సూచించారు. సిబ్బందికి విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చొరవ తీసుకుంటామని భరోసా కల్పించారు. వ్యక్తిగత, శాఖపరమైన సమస్యలు పరిష్కరించేందుకు ముందుంటామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సదయ్య, స్పెషల్ బ్రాంచ్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్‌కుమార్

పూర్తి వివరాలు సమర్పించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పూర్తి వివరాలు సమర్పించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎంపీ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే వారు తమ వివరాలను ఎన్ఐసీ సిబ్బందికి అందించాలన్నారు. ఉద్యోగం చేసే ప్రదేశం, జిల్లా, నివాస ప్రాంతం, ఎపిక్ కార్డు నంబర్ ఇతర వివరాలు సమర్పించాలన్నారు. రెగ్యులర్, ఒప్పంద, పొరుగు సేవల సిబ్బంది రిమార్కులతో పంపించాలని, రేపటిలోపు సిబ్బంది పూర్తి వివరాలను ఎన్ఐసీ ఇన్‌చార్జి శ్రీనివాస్, శ్రీకాంత్‌కు అందించాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి పంచాయతీరాజ్ ఇంజినీర్లు, ఉపాధిహామీ అధికారులతో సీసీరోడ్ల నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి


ఎన్నికల్లో భాగంగా పోస్టల్ బ్యాలెట్ విధులు కేటాయించిన అధికారులు, సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి పోస్టల్ బ్యాలెట్ జారీ కోసం విధులు నిర్వర్తించే తహసీల్దార్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సిబ్బందికి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి శుక్రవారం హాజరయ్యారు. సంబంధిత అధికారులు, సిబ్బంది మాత్రమే దరఖాస్తులు స్వీకరించాలని, హోం ఓటింగ్ సర్వీస్ ఓటర్లు, ఎన్నికల్లో విధులు నిర్వహించే సిబ్బంది నుంచి ఫారం 12ఏ, 12బీ, 12డీ ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. వివరాలను రోజువారీగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

జోడేఘాట్.. సౌకర్యాలు నిల్!





కళావిహీనంగా కనిపిస్తున్న జోడేఘాట్ గ్రామం

↑ జోడేఘాట్‌లో పర్యాటకుల ఆహ్లాదం, పచ్చదనం కోసం వేలాది మొక్కలు నాటారు. సంరక్షణ చర్యలు లేకపోవడంతో ప్రస్తుతం మొక్కల జాడే కనిపించడం లేదు. అలంకరణ గడ్డి కూడా పూర్తిగా ఎండిపోయింది. నాటిన మొక్కల సంఖ్య, నిధుల వినియోగంపై అప్పట్లో ఆరోపణలు కూడా వచ్చాయి. పచ్చదనంలో కళకళలాడాల్సిన ఈ ప్రదేశం ప్రస్తుతం కళావిహీనంగా కనిపిస్తోంది. ఎండిన గడ్డితో పరిసరాలు అధ్వానంగా మారాయి.

- పోరాట వీరుడు కుమురం భీం గడ్డపై వసతులు కరువు
- పర్యాటక అభివృద్ధిపై దృష్టి సారించని ప్రభుత్వాలు
- కార్యరూపం దాల్చని కాటేజీలు, హోటళ్ల నిర్మాణం
- కాంగ్రెస్ సర్కారు దృష్టి సారిస్తే మేలు

కెరమెరి(ఆసిఫాబాద్): గిరిజనుల హక్కుల కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన కుమురంభీం నడిచిన నేలకు గుర్తింపు కరువవుతోంది. చరిత్ర పుటల్లోకెక్కిన ప్రాంతం స్వరాష్ట్రంలోనూ అభివృద్ధికి నోచుకోవడం లేదు. జిల్లాకే తలమానికమైన కెరమెరి మండలం జోడేఘాట్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దడంలో అధికారులు చిత్తశుద్ధి చూపడం లేదు.

పర్యాటకుల తాకిడి పెరిగినా..

ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత 2014 అక్టోబర్ 8న కుమురంభీం వర్ధంతి సభలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొన్నారు. 'భీం మ్యూజియం ఏర్పాటు కోసం రూ.25 కోట్లు మంజూరు చేశాం.. ఇక నుంచి పర్యాటకుల తాకిడి పెరుగుతుంది. ఇక్కడ కాటేజీలు.. హోటళ్ల నిర్మాణం చేపడతాం..' అని హామీలు ఇచ్చారు. తర్వాతి కాలంలో భీం మ్యూజియం నిర్మాణం పూర్తికావడంతో క్రమంగా ఈ ప్రాంతానికి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత జోడేఘాట్ అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో కళావిహీనంగా మారింది. వేసవి సమీపిస్తుండటంతో ప్రస్తుతం జోడేఘాట్‌కు పర్యాటకుల తాకిడి పెరిగింది. వివిధ పాఠశాలల విద్యార్థులను పాఠశాలల యాజమాన్యాలు పిక్నిక్ కోసం ఇక్కడికే తీసుకువస్తున్నాయి. ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలతోపాటు మహారాష్ట్రలోని చంద్రాపూర్, రాజురా, గఢ్‌చందూర్ తదితర ప్రాంతాల నుంచి ప్రజలు ఎక్కువగా మ్యూజియం వద్దకు వస్తుంటారు. కానీ పర్యాటకులకు కనీసం ఇక్కడ మినరల్ వాటర్ బాటిల్ కూడా దొరకడం లేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కాంగ్రెస్ సర్కారు దృష్టి సారిస్తే మేలు జరుగుతుందని గిరిజనులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కానరాని కాటేజీలు..

గత ప్రభుత్వం పర్యాటకుల సౌకర్యార్థం కాటేజీల నిర్మాణం చేపడతామని ప్రకటించినా ఇప్పటివరకు అది కార్యరూపం దాల్చలేదు. దాదాపు పదేళ్లు పూర్తవుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు సైతం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. మ్యూజియంలో, భీం విగ్రహం వద్ద, విశ్రాంతి, మీటింగ్ గదుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దాదాపు 16 కెమెరాలు పని చేయకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. గతేడాది వర్షాలకు షార్ట్‌సర్క్యూట్ జరిగింది. విద్యుత్ మరమ్మతులు చేపట్టాలని ఐటీడీఏ అధికారులకు విన్నవించినా నిధులు మంజూరు చేయలేదు.

పచ్చదనం జాడేది..

మ్యూజియం వెనక భాగంలోని ఖాళీ స్థలంలో సుమారు 29 వేల మొక్కలు నాటారు. 100 మూలికల మొక్కలను ప్రత్యేకంగా తెప్పించారు. నిర్వహణ, సంరక్షణను మర్చిపోవడంతో ప్రస్తుతం చాలా మొక్కలు ఎండిపోయి ఆ ప్రాంతం అంతా అధ్వానంగా మారింది. గతేడాది ఉపాధిహామీ పథకంలో నాటిన కొన్ని మొక్కలు మాత్రమే కనిపిస్తున్నాయి. అటవీశాఖ, టూరిజం శాఖల ఆధ్వర్యంలో నాటిన మొక్కల్లో కనీసం రెండు వేలు కూడా బతకలేదు. నీటి సౌకర్యం లేక అలంకరణ కోసం పెంచుతున్న గడ్డి ఎండిపోయింది. ఇప్పటివరకు ఎండిన గడ్డి ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు. ఒక్క చిన్న నిప్పు రవ్వ రగిలినా భారీ ప్రమాదం చోటు చేసుకుంటుందని భయపడుతున్నారు. అధికారులు స్పందించి జోడేఘాట్ అభివృద్ధిపై దృష్టి సారించాలని ఆదివాసీ సంఘాల నాయకులు, ప్రజలు కోరుతున్నారు.

ఎండుగడ్డి తొలగించాలి



పర్యాటకుల కోసం కాటేజీలు, ఐడీడీఏ ఆధ్వర్యంలో హోటల్ ఏర్పాటు చేస్తే సౌకర్యవంతంగా ఉంటుంది. మొక్కల సంరక్షణ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించాలి. ఎండిన గడ్డిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి. గడ్డితో అగ్ని ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

– పెందోర్ రాజేశ్వర్, గ్రామ పెద్ద, జోడేఘాట్

కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్న కేంద్రం

- మండిపడిన ప్రజాసంఘాల నాయకులు
- జిల్లాలో ప్రశాంతంగా సమ్మె

ఆసిఫాబాద్‌అర్బన్: దేశంలోని కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం ఊడిగం చేస్తోందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉపేందర్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి చాంద్‌పాషా, టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు తిరుపతి మండిపడ్డారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన దేశవ్యాప్త సమ్మె ప్రశాంతంగా ముగిసింది. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అక్కడి నుంచి స్థానిక అంబేద్కర్ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ఇప్పటివరకు 36 సార్లు దేశవ్యాప్తంగా సమ్మె చేపట్టినా కేంద్ర ప్రభుత్వం మాత్రం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను వీడటం లేదన్నారు. హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశ, గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. మోదీ ప్రభుత్వం తెచ్చిన 4 లేబర్ కోడ్‌లతో కార్మికులంతా హక్కులు, సామాజిక భద్రతను కోల్పోయి రోడ్డున పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు, విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, రైతులు ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్వామి, రాజాగౌడ్, వెంకటేశ్వర్లు, శ్రీకాంత్, తిరుపతి, సాగర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాగా.. సమ్మె నేపథ్యంలో జిల్లా కేంద్రంలో సీఐ సతీశ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. సమ్మె ప్రభావం పాక్షికంగా కనిపించింది.



జిల్లా కేంద్రంలో ఆందోళన చేస్తున్న నాయకులు

మేడారం జాతరకు ప్రత్యేక రైళ్లు

సాక్షి, ఆసిఫాబాద్: మేడారం జాతర సందర్భంగా రైల్వేశాఖ కాగజ్‌నగర్ నుంచి వరంగల్ వరకు ప్రత్యేక రైళ్లు నడపనుంది. ఈ మేరకు రైల్వేశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 21 నుంచి 24 వరకు ప్రతిరోజూ ఉదయం 5.30 గంటలకు కాగజ్‌నగర్ నుంచి ప్రారంభమయ్యే ఈ రైలు ఉదయం 10 గంటలకు వరంగల్‌కు చేరుకుంటుంది. అలాగే వరంగల్ నుంచి మధ్యాహ్నం 12 గంటల బయలుదేరి సాయంత్రం 4 గంటలకు తిరిగి కాగజ్‌నగర్‌కు చేరుకుంటుంది. కుమురంభీం, మంచిర్యాల జిల్లాల పరిధిలో రాలపేట్, ఆసిఫాబాద్‌రోడ్, రేపల్లేవాడ, రేచిని రోడ్, బెల్లంపల్లి, మందమర్రి, రవీంద్రఖని, మంచిర్యాల స్టేషన్లకు హాల్టింగ్ కల్పించారు.

క్లుప్తంగా

వృద్ధుడి ఆత్మహత్య


బాపు (ఫైల్)

భీమిని: ఓ వృద్ధుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బిట్టూర్‌పల్లి గ్రామానికి చెందిన ఏటకారి బాపు (65) ఈ నెల 14న ఇంటి నుంచి వెళ్లాడు. రెండురోజులుగా కుటుంబీకులు అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం బిట్టూర్‌పల్లి గ్రామ సమీపంలోని తన చేను పక్కనే ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఉండడాన్ని మేకల కాపరులు గమనించారు. అతడి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని మృతదేహం

పాతమంచిర్యాల: మంచిర్యాల–పెద్దపల్లి రైల్వేస్టేషన్ల మధ్య రైల్వేఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో శుక్రవారం ఉదయం 8.30 గంటలకు గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ కే.సురేశ్ తెలిపారు. మృతుడి వయస్సు 40–45 సంవత్సరాలు ఉంటుందని పేర్కొన్నారు. మృతుడు క్రీంకలర్ ఫుల్ షర్టు, బ్లూకలర్ జీన్స్ ధరించి ఉన్నాడని తెలిపారు. ప్లాస్టిక్ డబ్బాలు ఏరుకునేందుకు పట్టాలు దాటుతుండగా అదే పట్టాలపై బల్లార్షా నుంచి రామగుండం వైపు వెళ్లే రైలు బండి తగిలి మృతి చెంది ఉంటాడన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, మృతదేహన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచామని పేర్కొన్నారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు 8712658596 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుకున్న బియ్యం, నిందితుడితో పోలీసులు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలో అక్రమంగా వ్యాన్‌లో తరలిస్తున్న 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ ఎస్సై లచ్చన్న ఆధ్వర్యంలో శనివారం పట్టుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన టేకు కనకయ్య చుట్టుపక్కల గ్రామాల నుంచి పీడీఎస్ రైస్ తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్రలో ఎక్కువ ధరకు అమ్మేందుకు వ్యాన్‌లో తరలిస్తుండగా పట్టుకున్నారు. పట్టుబడిన రైస్ విలువ సుమారు రూ.60 వేలు ఉంటుంది. పట్టుబడిన వ్యక్తితోపాటు బియ్యంతో కూడిన వ్యాన్‌ను తదుపరి చర్యల కోసం మందమర్రి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

లక్క కోసం వృక్ష మేధం


ముక్కిడిగూడం, జాజులపేట అటవీ ప్రాంతంలో నేలకొరిగిన బొజ్జ, తిరుమాను వృక్షాలు


మహారాష్ట్రలోని ఏటపల్లి వద్ద అధికారులకు పట్టుబడిన లక్క వాహనం, నిందితులు (ఫైల్)

- అడవిలో సేకరిస్తున్న గ్రామస్తులు
- నేలమట్టమవుతున్న వేలాది చెట్లు
- అధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు
- యథేచ్ఛగా సాగుతున్న దందా
- గ్రామస్తుల ఫిర్యాదుతో వెలుగులోకి..

వేమనపల్లి: తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దు ప్రాణహిత వెంట ఉన్న అడవుల్లో లక్క సేకరణ జోరుగా సాగుతోంది. దీనిపై అభ్యంతరాలు లేకపోవడంతో ఇది తయారయ్యే చెట్లను విచ్చలవిడిగా నేలకూలుస్తున్నారు. మూడు నెలలుగా రెండు రాష్ట్రాల సరిహద్దుల్లో వీటి వ్యాపారం భారీ స్థాయిలో జరిగినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై అటవీశాఖ అధికారులు ఆలస్యంగా స్పందించారు. రెండు నెలల క్రితం లక్క సేకరణదారులపై దృష్టి సారించారు. పక్కనే ఉన్న మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అహేరి, సిరోంచ, ఏటపల్లి అటవీ డివిజన్ల నుంచి చాలామంది నది దాటి వచ్చి వేమనపల్లి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం అడవుల్లోని లక్క సంపద తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. జాజులపేట ముక్కిడిగూడం, కళ్లంపల్లి, రాంపూర్, రాగులపల్లి గ్రామాల్లోని కొందరు వ్యక్తులతో కుమ్మక్కై లక్క తీసుకెళ్లినట్లు తెలుపుతున్నారు. కిలోకు రూ.400 చొప్పున కూలీల నుంచి కొనుగోలు చేసి నది దాటించి రూ.1,500 నుంచి రూ.1,800కి కిలో చొప్పున విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో అటవీ అధికారులు దాడులు జరపగా మహారాష్ట్రకు చెందిన కొందరు అధికారుల కళ్లుగప్పి ప్రాణహిత నది దాటి పారిపోయారు. ముక్కిడిగూడెంకు చెందిన ఎనిమిది మందితోపాటు లక్క స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు.

లక్కతో ఉపయోగాలివి..

బొజ్జ, తిరుమాను వృక్షాలపై తయారయ్యే లక్కతో అనేక ఉపయోగాలున్నాయి. రంగుల అద్దకం, వార్నిష్ తయారీ, రబ్బర్, పాలిష్ తయారీలో లక్కను వాడతారు. లక్కతో గాజులూ తయారు చేస్తారు. బంగారు ఆభరణాల తయారీలోనూ ఉపయోగిస్తారు. ఏవైన వస్తువులు తయారు చేసి భద్రత కోసం లక్కతో సీల్ చేస్తారు. బొజ్జ, తిరుమాను వృక్షాలపై ఈ లక్క పురుడు పోసుకుంటుంది. లాక్సిఫెర (లక్క), టకార్డియా (లక్క) అని దీనికి పేరుంది. ఉష్ణమండల దేశాల్లో ఈ లక్క ఉత్పత్తి ఎక్కువ. లక్క కీటకం చెట్లపై చేరి కొమ్మలను అంటిపెట్టుకుని రసాన్ని పీల్చి లక్కను విసర్జిస్తుంటాయి. ఈ విధంగా ఉత్పత్తి అయ్యే లక్కకు మంచి డిమాండ్ కూడా ఉంది.

లక్కకు మంచి డిమాండ్

ప్రాణహిత తీరం వెంట ఉన్న అటవీ ప్రాంతాల్లో బొజ్జ వృక్షాలపై లభ్యమయ్యే లక్కకు మంచి డిమాండ్ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ లక్కను ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసి ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, జార్ఖండ్ రాష్ట్రాలకు తరలించి రూ.5వేల నుంచి రూ.8వేలకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. పక్కనే ఉన్న మహారాష్ట్ర ఏటపల్లి వద్ద డిసెంబర్ 16వ తేదీన అక్కడి అసిస్టెంట్ ఫారెస్ట్ కన్జర్వేటర్ అశోక్‌పవార్ ఆధ్వర్యంలో రూ.5 లక్షల విలువైన లక్క స్వాధీనం చేసుకున్నారు. జీపు సీజ్ చేసి చెన్నూరి సంపత్, చీపెల్లి నారాయణ, చెన్నూరి పురుషోత్తం, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ప్రదీప్‌జ్ఞానేంద్ర, సుభాష్‌కుషన్స్‌పై కేసు నమోదు చేశారు. పట్టుబడిన లక్క 21 బస్తాలు కాగా, వేమనపల్లి, దహెగాం మండలాల నుంచి తరలిస్తున్నట్లు పైకేసులో పేర్కొనడం గమనార్హం.

ఫిర్యాదుతో వెలుగులోకి ఇలా..

ఇటీవల గ్రామాల్లో రాజకీయ విభేదాలతో లక్క వ్యవహారం వెలుగులోకి వచ్చింది. లక్క సేకరణ కోసం అడవుల్లోని బొజ్జ, తిరుమాను వృక్షాలు నేలకూలినా అటవీ అధికారులు పట్టించుకోవడం లేదని సీఎఫ్, డీఎఫ్‌వోకు ఫిర్యాదు చేసినట్లు తెలుపుతున్నారు. స్థానిక అధికారులు వంట చెరుకు కోసం పెళ్లి ఇతర అవసరాల కోసం కలప తెచ్చుకుంటే కేసులు పెడుతున్నారని వాపోతున్నారు. ఒడ్డుగూడం, కళ్లంపల్లి, రాంపూర్ బీట్‌లలో లబ్దిగుట్ట, మొద్దులగుట్ట, చిన్నగుట్ట, పాశినితోన ప్రాంతం వెంట వేలాది బొజ్జ, తిరుమాను వృక్షాలు నేలకూలినట్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే స్పెషల్ ఫోర్స్ అటవీ అధికారులు రంగంలోకి దిగి విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

'కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి'

పాతమంచిర్యాల: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బీసీలకు క్షమాపణ చెప్పాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఉదారి చంద్రమోహన్‌గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కౌశిక్‌రెడ్డి ఆంధ్ర పాలకులకు అమ్ముడుపోయి ఉద్యమకారులపై దాడులు చేసిన ద్రోహి అని విమర్శించారు.

కొత్త గనులు కేటాయించాలి


కోల్ సెక్రటరీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణికి కొత్త గనులు కేటాయించాలని సెంట్రల్ కోల్ సెక్రటరీ అమృత్‌లాల్‌మీనాను ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బీ జనక్‌ప్రసాద్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో అధికారుల సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన మీనాను ఆయన కలిసి ఈమేరకు విజ్ఞప్తి చేశారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి చేస్తున్న రాష్ట్ర, దేశ పారిశ్రామిక అవసరాలను తీరుస్తుందని తెలిపారు. గనుల జీవితకాలం దగ్గరపడటంతో అవి మూతపడే స్థాయికి వచ్చాయని, కొత్తగనులు కేటాయిస్తేనే సింగరేణి ముందుకెళ్తుందని చెప్పారు. ఇప్పటికే బొగ్గు ఉత్పత్తితో పాటు థర్మల్ విద్యుత్ రంగంలోనూ సింగరేణి తనదైన శైలిలో ముందుకు వెళ్తుందని తెలిపారు. సంస్థను రక్షించడానికి కొత్త గనులు అత్యవసరమని పేర్కొన్నారు. దీనిపై మీనా సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు జనక్‌ప్రసాద్ తెలిపారు.

చెన్నూర్‌లో సస్పెన్షన్ల పర్వం


విచారణ చేస్తున్న సీఈవో నరేందర్

- నాడు ఏవో.. నేడు ఏడీఏ, ఏవో
- ఏడాది వ్యవధిలో ముగ్గురిపై వేటు

చెన్నూర్: చెన్నూర్ వ్యవసాయశాఖలో ఏడాదిగా సస్పెన్షన్ల పర్వం కొనసాగుతోంది. యూరియా ఇండెంట్ కోసం ఫర్టిలైజర్స్ డీలర్ల వద్ద డబ్బుల వసూలుకు పాల్పడుతున్నాడనే ఆరోపణల మేరకు గత నెల 24న జెడ్పీ సీఈవో నరేందర్ విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. సీఈవో నివేదిక మేరకు చెన్నూర్ ఏడీఏ జాడి బాపు, ఏవో కవితను సస్పెండ్ చేస్తూ జిల్లా వ్యవసాయాధికారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఏడాదిలో ముగ్గురు..

చెన్నూర్ వ్యవసాయశాఖలో ఏడాది కాలంగా ముగ్గురు అధికారులు సస్పెన్షన్‌కు గురయ్యారు. 2022లో చెన్నూర్ ఏవోగా విధులు నిర్వహించిన సుధాకర్ తోటి మహిళ ఉద్యోగినిపై వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణల మేరకు ఉన్నతాధికారులు వేటు వేశారు. అనంతరం చెన్నూర్ ఏవోగా కవిత బాధ్యతలు స్వీకరించారు. గత నెలలో ఫర్టిలైజర్ డీలర్ల వద్ద యూరియా ఇండెంట్‌ల కోసం ఏవోతో పాటు ఏడీఏలు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణల మేరకు ఇరువురిని సస్పెండ్ చేస్తూ జిల్లా వ్యవసాయాధికారి కల్పన ఉత్తర్వులు జారీ చేశారు.

అవినీతి ఆరోపణలతో..

పదేళ్ల క్రితం చెన్నూర్ ఏవో సుంకన్నను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అప్పటి ఫర్టిలైజర్ డీలర్ పోటు శ్రీనివాస్‌రెడ్డి వద్ద సుంకన్న డబ్బులు డిమాండ్ చేశారు. శ్రీనివాస్‌రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏవో సుంకన్న డీలర్ శ్రీనివాస్‌రెడ్డి నుంచి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఆనాటి నుంచి నేటి వరకు వ్యవసాయశాఖలో అవినీతి పర్వం కొనసాగుతోందనడానికి గతంలో సుంకన్న ఘటనే ఉదాహరణ అని చెన్నూర్ రైతులు, ఎరువుల డీలర్లు పేర్కొన్నారు.

గురుకులాల్లో ఉద్యోగాలకు ఎంపిక


రాజేశ్వరి


సునీల్‌కుమార్


మమత

కాసిపేట: మండల కేంద్రానికి చెందిన కొల్లూరి రాజేశ్వరి తెలంగాణ సోషల్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ గురుకుల పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)గా ఎంపికైంది. ముత్యంపల్లికి చెందిన సొప్పరి సునీల్‌కుమార్ మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే పాఠశాలలో సోషల్ పీజీటీగా నియమితులయ్యారు. పల్లంగూడకు చెందిన ఏదుల మమత ఫిజికల్ సైన్స్ పీజీటీగా మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలకు ఎంపికైంది. మమత తండ్రి భీమయ్య మండలంలోని కొత్తతిరుమలాపూర్‌లో ఎస్జీటీగా పనిచేస్తున్నారు. ఈసందర్భంగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరు నియామకపత్రాలు అందుకున్నారు. వీరికి పలువురు అభినందనలు తెలిపారు.

19న స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్


అధికారుల ద్వారా వివరాలు తెలుసుకుంటున్న జీఎం

మందమర్రిరూరల్: సింగరేణి పరిసర ప్రాంత నిరుద్యోగ యువత కోసం సింగరేణి ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ నుంచి మందమర్రిలోని సింగరేణి సిమ్‌టార్స్ ఆఫీస్ ప్రాంగణంలో స్కిల్ డెవలప్ మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్టు ఏరియా జీఎం మనోహర్ తెలిపారు. శనివారం ఏరియాలోని స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న సౌకర్యాల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంతవరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల వివరాలు సేకరించారు. ఆయన వెంట రియా ఎస్వో టూ జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్ అదికారులు ఉన్నారు.

సమ్మెకు మద్దతుగా ఆందోళనలు


ఎస్సార్పీ 3, 3ఏ గనిపై నిరసన తెలుపుతున్న ఐఎన్టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: దేశవ్యాప్త గ్రామీణ బంద్, సమ్మెలో భాగంగా సింగరేణిలో కార్మిక సంఘాల నాయకులు మద్దతుగా ఆందోళనలు చేపట్టారు. సింగరేణిలో సమ్మెకు దూరంగా ఉన్న సంఘాలన్నీ వివిధ రూపాల్లో నిరసన తెలిపాయి. శుక్రవారం ఏఐటీయూసీ, సీపీఐ ఆధ్వర్యంలో సీసీసీ కార్నర్‌లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదా, సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశ వ్యాప్తంగా గ్రామీణ బంద్, సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. కేంద్రం బొగ్గు పరిశ్రమలను ప్రైవేట్ పరం చేయడానికి కుట్ర చేస్తోందని, ఇందులో భాగంగా కొన్ని బ్లాక్‌లను అదాని, అంబానీలకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి కొము రయ్య, నాయకులు రేగుంట చంద్రశేఖర్, లింగం రవి, అఫ్రోజ్‌ఖాన్, కారుకూరి నగేశ్, మోతె లచ్చన్న, గునిగంటి నర్సింగ్‌రావు, మారుపెల్లి సారయ్య, నవీన్‌రెడ్డి, దొడ్డిపట్ల రవీందర్, లచ్చిరెడ్డి, మొగిలి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎస్సార్పీ 3, 3ఏ గనిపై..

దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా ఎస్సార్పీ 3, 3ఏ గనిపై ఐఎన్టీయూసీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉదయం విడుదలకు హాజరైన సమయంలో నాయకులు నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని కేంద్ర ప్రభుత్వ, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసించారు. ఐఎన్టీయూసీ పిట్ సెక్రటరీ పెంట శ్రీనివాస్, నాయకులు రిక్కుల గోపాల్‌రెడ్డి, సాంబయ్య, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ..

సీఐటీయూ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లో ర్యాలీ తీశారు. యూనియన్ కార్యాలయం నుంచి శ్రీరాపూర్ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్, నాయకులు చంద్రశేఖర్, సుధాకర్, శ్రీనివాస్, నవీన్, సదానందం, బాలకృష్ణ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు


ఏర్పాట్లు పరిశీలిస్తున్న సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: సమ్మక్క–సారలమ్మ జాతర ఏర్పాట్లు పకడ్బందీగా చేపడుతున్నట్లు శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి తెలిపారు. సీసీసీలోని సింగరేణి ముక్కిడి పోశమ్మ ఆలయం వద్ద కంపెనీ ఆధ్వర్యంలో జరిగే జాతర ఏర్పాట్లను ఆయన అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు జాతర జరగనుందని తెలిపారు. భక్తుల కోసం కంపెనీ ఆధ్వర్యంలో అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుద్దీపాలు తదితర సౌకర్యాలు కల్పించామని తెలిపారు. కార్మిక కుటుంబాలతో పాటు పరిసర ప్రాంతాల్లోని భక్తులు కూడా ఈ జాతరకు వచ్చి అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని సూచించారు. ఇంకా చేయాల్సిన ఏర్పాట్లను ఆయన అధికారులకు సూచించారు. ఏరియా ఎస్వోటూ జీఎం రఘుకుమార్, డీజీఎం సివిల్ ఆనంద్‌కుమార్, ఏరియా వర్క్‌షాప్ ఎస్ఈలు మల్లయ్య, సతీశ్ చక్రవర్తి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కాంతారావు, ఆలయ పూజారి రమేశ్ పాల్గొన్నారు.

కల్వరీ మినిస్ట్రీకి రక్తదాత అవార్డు


కలెక్టర్ ద్వారా అవార్డు తీసుకుంటున్న సిబ్బంది

కాసిపేట: బెల్లంపల్లి, సోమగూడెం జాతీయ రహదారి పక్కనున్న కల్వరీ మినిస్ట్రీ ప్రవీణ్ ఫౌండేషన్‌కు శుక్రవారం విశిష్ట రక్తదాన అవార్డు దక్కింది. కలెక్టర్ బదావత్ సంతోష్ చేతుల మీదుగా మినిస్ట్రీ ప్రతినిధులు శ్రీనివాస్, శామ్యూల్ అవార్డు, పత్రాన్ని తీసుకున్నారు. రక్తదానాన్ని మించిన ప్రాణదానం లేదని వారు పేర్కొన్నారు. రక్తదానంపై అవగాహన కల్పించడంతో పాటు స్వయంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి రెడ్‌క్రాస్ సొసైటీకి తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు రక్తం అందించినట్లు తెలిపారు. 2015నుంచి రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్న ప్రవీణ్, షారోన్ సేవలు గుర్తించి రెడ్‌క్రాస్ సొసైటీ తరపున ఫౌండేషన్‌కు బ్లడ్ డోనర్ మోటివేటర్ మెరిట్ సర్టిఫికెట్, స్వచ్ఛంద సేవా అవార్డు ప్రకటించారు. కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నట్లు ప్రవీణ్, షారోన్ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఒకరి అరెస్ట్


నిందితుడితో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తాండూర్: అక్రమంగా గంజాయి తరలి స్తున్న ఒకరిని రామగుండం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ముందస్తు సమాచారం మేరకు శుక్రవారం టాస్క్‌ఫోర్స్ ఎ స్సై లచ్చన్న సిబ్బందితో లింగధరిగూడెం వెళ్లే మార్గంలో తనిఖీలు చేపట్టారు. లింగధరి గూడెం గ్రామానికి చెందిన జాడి రుక్మాజీ అనుమానాస్పదంగా కనిపించగా అతడిని అ దుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 100 గ్రాముల గంజాయి లభించింది. అతడిని విచారించగా తన ఇంట్లో పెంచిన గంజాయిని తాండూర్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తున్నానని నిందితుడు పేర్కొన్నా డు. నిందితుడిని తాండూర్ పోలీసులకు అప్పగించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: ఇంటర్ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ప్రేమ విఫలమై, చదువుపై ఇష్టాన్ని పోగొట్టుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఎస్సై మహేందర్, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తుమ్మిడిగూడ సమీపంలోని గోండ్‌గూడకు చెందిన టేకం అంబుబాయి, కృష్ణ దంపతుల కుమారుడు శ్రీవర్ధన్(17) మంచిర్యాలలోని ఓ ఇంట్లో మరో ముగ్గురు మిత్రులతో కలిసి అద్దెకుంటున్నాడు. స్థానిక ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్నాడు. స్వగ్రామం గోండ్‌గూడకు చెందిన ఓ యువతితో ప్రేమలో పడ్డాడు. ఈ విషయంలో కత్తితో చేతిపై కోసుకున్నాడు. గురువారం రాత్రి గదిలో ఎవరూ లేనపుడు ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. శ్రీవర్ధన్ స్నేహితులు వచ్చి చూడగా మృతదేహం వేలాడుతూ కనిపించింది. మృతు డి తల్లి అంబుబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గిరిజన విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు కోచ్ అరవింద్, హెచ్ఎం కృష్ణారావు తెలిపారు. శుక్రవారం పాఠశాల అవరణలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఈ నెల 17 నుంచి 19వరకు నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు పాఠశాల నుంచి సత్యభామ, నందిని, అంజలి, మత్తుబాయి ఆదిలాబాద్ జట్టు నుంచి పాల్గొంటారని తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

రామకృష్ణాపూర్: రవీంద్రఖని రైల్వేస్టేషన్ స మీపంలో శుక్రవారం రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు మంచిర్యాల రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజేశ్వర్ తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేవని పేర్కొన్నారు. తెలుపు షర్టు, నల్లరంగు జీన్స్ ధరించి ఉన్న మృతుడి వయస్సు దాదాపు 30 నుంచి 35 వరకు ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుతాస్పత్రి మార్చురీలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712580664 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పథకం ప్రకారమే దంపతుల హత్య


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్


హత్యకు గురైన దస్రూ, బైనబాయి దంపతులు (ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): సొంత అన్నే తన ఇద్దరు కుమారులు, కూతురితో కలిసి తమ్ముడు, మరదలిని గొడ్డలితో నరికి హత్య చేసిన విషాదకర ఘటన గురువారం వాంకిడి మండలం ఖమాన గ్రామంలో జరిగిన విషయం తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో హత్యకు సంబంధించిన వివరాలు సీఐ శ్రీనివాస్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఖమాన గ్రామానికి చెందిన డెంగ్రె పత్రు, డెంగ్రె దస్రూ (50) ఇద్దరు అన్నదమ్ములకు పక్కపక్కనే పొలాలున్నాయి. మూడేళ్ల నుంచి ఇరు కుటుంబాల మధ్య పొలం గట్టు విషయంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. గురువారం ఉదయం పత్తేరడానికి వెళ్లిన ఇరుకుటుంబాలవారు మళ్లీ గొడవ పడ్డారు. దీంతో పత్రు కుటుంబ సభ్యులు ఆగ్రహావేశాలకు గురయ్యారు. ఎలాగైన తమ్ముడు దస్రూ, మరదలు బైనబాయి (40)ని చంపేయాలని పథకం పన్నారు. పత్రు తన ఇద్దరు కొడుకులైన తిరుపతి, సాయికి గొడ్డళ్లు ఇచ్చి కూతురు మాయతో పాటు కర్ర పట్టుకుని ముందుగా పక్కనున్న చేనులో పత్తి ఏరుతున్న బైనాబాయిపై దాడి చేసి చంపేశారు. అక్కడి నుంచి కిలో మీటరు దూరంలోని మరో చేనులో పనులు చూసేందుకు వెళ్లిన దస్రూను వెంబడించి గొడ్డళ్లు, కర్రలతో దాడి చేసి హత్య చేశారు. మృతుల కూతురు సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నేరం ఒప్పుకొన్న పత్రు, తిరుపతి, సాయి, మాయపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ తెలిపారు.